క్లుప్తంగా

శుభాకాంక్షలు



నాంపల్లి: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను జోయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ జోయా నూరిన్, గ్లోబల్ మెడికల్ సిస్టం ఎండీ చరణ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సన్మానం



రూప్‌రాజ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురా సర్దార్ పటేల్‌నగర్‌లోని పాండురంగ విఠల్ రుక్మిణీ ఆలయంలో అఖండ తాళ సప్తాహంలో భాగంగా ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. బీజేపీ నాయకులు చర్మాణి రూప్‌రాజ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూప్‌రాజ్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంగ్రామ్, ఎం.విలాస్‌రావు, తులసిరామ్, శివాజీ రావు, కృష్ణ, దశరథ్, బాలాజీ, దిగంబరా, దొండేరామ్, కాశీనాథ్, నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాలో బలిజ సంఘం నాయకులు



గౌలిపురా: రాష్ట్ర వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు లింగ బలిజలకు ఓబీసీ సాధనే లక్ష్యంగా చలో ఢిల్లీ మహాధర్నా కార్యక్రమంలో సంఘం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.సంగమేశ్వర్, అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, కోశాధికారి దినేశ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి బస్సు అదనపు ట్రిప్పులు

సంతోష్‌నగర్: మిథాని డిపో ఆపరేట్ చేస్తున్న 104ఎ, 104ఆర్, 102బీ/203ఎన్, ఆర్‌సీఐ, బాలాపూర్ రూట్లలో అదనంగా ట్రిప్పులను 2వ తేదీ(సోమవారం) నుంచి పెంచుతున్నామని హయత్‌నగర్ డిప్యూటీ రిజినల్ మేనేజర్ జగన్, మిథాని డిపో మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి కూడా వివిధ రూట్లలో ట్రిప్పులను పెంచుతున్నామన్నారు. 104ఎ బస్సు అదనంగా 15 ట్రిప్పులు మహిళా కళాశాలకు, సికింద్రాబాద్‌కు అదనంగా 37 టిప్పులు, 104ఆర్ బస్సు అదనంగా మహిళా కళాశాలకు 20 ట్రిప్పులు, సికింద్రాబాద్‌కు అదనంగా 37 ట్రిప్పులు, 102బీ/203బీ బస్సు అదనంగా మహిళా కళాశాలకు 15 టిప్పులు, సికింద్రాబాద్‌కు అదనంగా 37 టిప్పులను నడపనున్నట్లు చెప్పారు.

సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తూ..

గోల్కొండ: కోవెల రంగనాయక స్వామి ఆలయ సంక్రాంతి ఉత్సవాలను ఈ ఏడాది వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు సోమారావు జనార్దన్, ఎం.నర్సింహ అన్నారు. ఆలయ సంక్రాంతి ఉత్సవ కరపత్రాన్ని ఆదివారం ఆలయం వద్ద ఆవిష్కరించారు. 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు 3 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈఓ శ్రీనివాసరాజు సూచనల మేరకు ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కుంటి విజయ్ బాబు, ఎ.అశోక్ కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.

ద‘వావ్’ఖానా..



గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో వైద్య సేవలు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిని చూస్తే అది సర్కారీ దవాఖానా అని ఎవరూ అనుకోరు. ఆస్పత్రికి ఉన్న హంగులు కార్పొరేట్ ఆస్పత్రికి ధీటుగా ఉన్నాయి. ఒకప్పుడు ఆ ఆస్పత్రికి రావాలంటేనే పేషెంట్లు వెనుకాడేవారు. ప్రస్తుతం కార్వాన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు పట్టుబట్టి వైద్య సేవలకు గోల్కొండ ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు. ఇక్కడ అందుబాటులో ఉన్న వైద్యులు, వైద్య సేవలు ప్రతిఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి.

జెట్ వేగంతో..

ఆస్పత్రి గేటులోకి రాగానే ఆస్పత్రిలోని పచ్చని ప్రాంగణాలు రోగులకు సగం రోగాన్ని దూరం చేస్తున్నాయి. చిరునవ్వుతో పలకరించే వైద్యులు, వైద్య సిబ్బందిని చూసి రోగులు హ్యాపీగా ఫీలవుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం ఆస్పత్రికి కొత్త భవనం సమకూరినప్పటి నుంచి ఆస్పత్రి జెట్ వేగంతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ఈ ఆస్పత్రిలో రోగులకు అన్ని వైద్య సేవలు అందిస్తోంది. మొత్తం 26 మంది వైద్యులు అందుబాటులో ఉండగా వీరిలో ఇద్దరు ఎంతో నైపుణ్యం కలిగిన సివిల్ సర్జన్లు ఉన్నారు. ఎంతటి రోగానికైనా వైద్యం అందించడమే కాకుండా వెంటనే శస్త్ర చికిత్సలు అందిస్తున్నారు.

అన్ని రకాల వైద్య సేవలు

ప్రభుత్వ చొరవ వల్ల నెలకు 160–180 ప్రసవాలు, ప్రతినెలా 40 నుంచి 50 మేజర్ సర్జరీలు, 200 మైనర్ సర్జరీలు జరుగుతున్నాయి. ప్రతినెలా అవుట్ పేషెంట్లు సంఖ్య 25 వేలు ఉంటోంది. ఇన్‌పేషెంట్ల ఆక్యుపెన్సీ కూడా 100 శాతం ఉంది. అల్ట్రాసౌండ్ ప్రతినెలా సుమారు 500, ఎక్స్‌రేలు నెలకు 700–800, ఈసీజీలు 500–600 నిర్వహిస్తున్నారు. ప్రతినెలా 20 నుంచి 22 వేల రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. హెచ్ఐవీ సోకిన వారికి ప్రత్యేకంగా ఐసీడీసీ విభాగం ఉంది. ఇందులో ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు కౌన్సెలర్లు ప్రత్యేకంగా ఉన్నారు. హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, చికిత్స కూడా అందిస్తున్నారు. కోవిడ్–19 విభాగం రౌండ్ ద క్లాక్ పని చేస్తోంది. ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేసి ర్యాపిడ్ యాంటిజన్, ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహిస్తున్నారు.

ప్రతి బెడ్‌కు ఆక్సిజన్ యూనిట్

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కౌసర్ మొహియుద్దీన్ ఎంతగానో సహకరిస్తున్నారు. ఆస్పత్రి కోసం ప్రత్యేకంగా ఆక్సిజన్ ఉత్పత్తి యూనిట్ ఉంది. ఇద్దరు డ్రైవర్లతో అంబులెన్స్ అందుబాటులో ఉంటుంది. డ్యూటీ మెడికల్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తూ ఏ సమయంలోనైనా అత్యవసర వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటారు. ఆస్పత్రికి 20 బెడెడ్ ఐసీయూ విభాగం ప్రత్యేకంగా ఉంది. ప్రతిబెడ్‌కు ఆక్సిజన్ యూనిట్ దీని ప్రత్యేకత.

కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా..

- గోల్కొండ ఆస్పత్రికి ఆధునిక హంగులు
- అన్ని రకాల వైద్య సేవలు ఒకేచోట
- 24/7 కొనసాగుతున్న వైద్య సేవలు

వైద్యంతో పాటు టెస్టులూ..

- మొత్తం 26 మంది వైద్యులు
- ముగ్గురు ఫిజీషియన్లు,
- ఐదుగురు గైనకాలజిస్టులు
- ఐదుగురు అనస్థీషియా వైద్యులు
- దంత వైద్యులు
- కంటి డాక్టర్‌తో పాటు ఇద్దరు ఈఎన్‌టీ వైద్యులు
- అన్ని హంగులతో ల్యాబ్, అల్ట్రాసోనోగ్రఫీ,
- ఎక్స్‌రే, ఈసీజీ సేవలు అందుబాటులో ఉన్నాయి.

అన్నిరకాల వైద్య సేవలు



ఎట్టి పరిస్థితిలోనూ వైద్యసేవలు అందించడానికి వైద్యులు సిద్ధంగా ఉన్నారు. రోగుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా వృత్తిధర్మం నిర్వహిస్తున్నాం. ఆస్పత్రి అభివృద్ధికి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ వెన్నెముకగా నిలుస్తున్నారు. నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాదే నెం.1 ఆస్పత్రి.

– డాక్టర్ మజహర్ ఉల్లా, ఆస్పత్రి సూపరింటెండెంట్

సేవా భావంతో..



నిబద్ధత గల వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ ఆస్పత్రికి వెన్నెముకవంటి వారు. వారి సహకారంతోనే అత్యుత్తమైన సేవలు అందిస్తున్నారు. సిబ్బంది, సహాయ సకారాలతో ఒక్క కేసు కూడా పైఆస్పత్రికి రిఫర్ చేయకుండా సాధ్యమైనంత వరకు ఇక్కడే సేవలు అందిస్తున్నాం.

– ఖాజా రవూఫ్ ఉద్దీన్, ఆర్ఎంఓ

హోంమంత్రికి శుభాకాంక్షలు



హోంమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నందకిశోర్ వ్యాస్

అబిడ్స్: హోంమంత్రి మహమూద్ అలీకి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నందకిశోర్ వ్యాస్ పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభంజనం ఎలా ఉందో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ గాలులు జోరుగా వీస్తున్నాయని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో దేశంలో అత్యధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకుంటుందని చెప్పారు. అబద్ధాల బీజేపీ మాటలు ప్రజలు నమ్మడం లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గోషామహల్‌తో పాటు తెలంగాణ నలుమూలలా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు.

రాష్ట్ర మంత్రులకు స్వాగతం



మంత్రులు హరీశ్‌రావు, తలసానికి స్వాగతం పలుకుతున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకులకు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఘన స్వాగతం పలికారు. జాంబాగ్‌లోని ఎగ్జిబిషన్‌కు ఆదివారం హాజరైన వచ్చిన హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..... హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లో దేశంలోనే నెంబర్‌1 స్థానానికి చేరిందన్నారు. పర్యాటక రంగంతో పాటు ఐటీ, ఇతర రంగాల్లో హైదరాబాద్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అగ్రగామిగా తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో నందు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా బృందం

అఫ్జల్‌గంజ్: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆర్టీసీ కళాబృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎంజీబీఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రచార రథాన్ని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించారు.

కానిస్టేబుల్ బాబూరావుకు అభినందనలు

మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లోని అవుట్ పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ బాబూరావును ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. ఎంజీబీఎస్ ప్రాంగణంలో చోరీలు జరగకుండా బందోబస్తు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటీవల చోరీకి గురైన 8 మొబైల్ ఫోన్లు, బైకులను తిరిగి ప్రయాణికులకు అందజేశారు.



ఆర్టీసీ కళాబృందాన్ని అభినందిస్తున్న ఎండీ వీసీ సజ్జనార్



కానిస్టేబుల్ బాబూరావును అభినందిస్తున్న ఎండీ వీసీ సజ్జనార్

సమస్యల పరిష్కారానికే.. బసయాత్ర



మాలకుంట గుడిసెవాసుల సమస్యలను తెలుసుకుంటున్న గడ్డం గంగాధర్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ మాలకుంట బస్తీలో గడ్డం గంగాధర్ యాదవ్ ఆధ్వర్యంలో రెండో విడత దళితవాడలో బసయాత్రను ప్రారంభించారు. మాలకుంట గుడిసెవాసుల వద్దకు శ్రీనివాస్ యాదవ్ నేరుగా వెళ్లి వారికి బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. ఇక్కడ దాదాపు 40 ఏళ్లుగా పూరి గుడిసెలలో 100 మంది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, వీరిలో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవకాశం కల్పించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. దళితులు, బడుగు బలహీన, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేయడమే ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమని, అందుకోసమే ఈ దళితవాడలో బసయాత్రతో సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. అనంతరం బస్తీ ప్రజలతో కలిసి కేక్ కట్‌చేసి, నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాలకుంట బస్తీ సంఘం అధ్యక్షులు శివకుమార్ మాదిగ, బీఆర్ఎస్ నాయకులు జైశంకర్, పున్నం శంకర్, వినోద్ కుమార్, శేఖర్, నాయక్, సాయి, రాజు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన కళోత్సవాలు అభినందనీయం



వకులభరణం కృష్ణమోహన్‌రావుకు పురస్కారాన్ని అందజేస్తున్న రసమయి బాలకిషన్

గన్‌ఫౌండ్రీ: ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తెలుగు అసోసియేషన్ నార్త్ అమెరికా(తానా) సంస్థలు భాగ్యనగరంలో బహుజన కళోత్సవాలను నిర్వహించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాయని రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. రవీంద్రభారతిలో తానా ఫౌండేషన్ తారా ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో బహుజన కళాఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావుకు బహుజన బంధు పురస్కారాన్ని ప్రదానం చేశారు. బహుజన వర్గాల నుంచి పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న కిన్నెర మొగులయ్య, చింతకింది మొగులయ్య, ఆచార్య కొలకలూరి ఇనాక్‌తో పాటు పలువురిని సన్మానించారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు తొటకూర ప్రసాద్, తానా ఫౌండేషన్ అధ్యక్షుడు అంజయ్య చౌదరి, తారా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ శుభం కలగాలి



ఎమ్మెల్యే కౌసర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ ఎం.గోపాల్

గోల్కొండ: నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరికీ శుభం కలగాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రి మాజీ మెడికల్ సూపరింటెండెంట్(సివిల్ సర్జన్) డాక్టర్ ఎం.గోపాల్ ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఆయన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని ఆయన సూచించారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజలో మాడిశెట్టి సదానందంగుప్తా, నరేష్‌గౌడ్, లాల్‌సింగ్ తదితరులు

అబిడ్స్: అయ్యప్ప స్వామి మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. ధూల్‌పేట రహీంపురాలో స్వామియే శరణమయ్యప్పా అంటూ స్వాముల భక్తిగీతాలు, భజనలు ఆకట్టుకున్నాయి. నరేష్‌గౌడ్, కొత్త నవీన్‌గౌడ్, రవీందర్ సింగ్, మాడిశెట్టి సదానందం గుప్తా, భాస్కర్ గౌడ్, నీలం గౌడ్, సత్యనారాయణ, విపిన్‌సింగ్, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, నందాసింగ్ గురుస్వాముల ఆధ్వర్యంలో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు లాల్‌సింగ్, శశికళ కృష్ణ, బీఆర్ఎస్ నేత ఆనంద్‌సింగ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పూజలు చేశారు. దాదాపు వెయ్యిమంది భక్తులు పాల్గొన్నారు.

అన్ని ఉత్సవాలు.. శాంతియుతంగా..



చార్మినార్ వద్ద కేక్ కట్ చేస్తున్న సీపీ సీవీ ఆనంద్ తదితరులు

చార్మినార్: నగరంలో అన్ని ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేలా చూస్తామని, ఇందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. సీపీ సీవీ ఆనంద్ చార్మినార్ వద్ద శనివారం అర్ధరాత్రి కేక్ కట్ చేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ ఉండదన్నారు. సౌత్‌జోన్ డీసీపీ సాయి చైతన్య, సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ చక్రవర్తి, సౌత్‌జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడు తదితరులు ఉన్నారు.

ఆడి పాడిన విద్యార్థులు

గోల్కొండ: టోలిచౌకి రవీంద్రభారతి పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా సాగాయి. పిల్లలు ఫ్యాన్సీ డ్రెస్సులతో అందరినీ ఆకట్టుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా హ్యాపీ న్యూఇయర్ అంటూ కేరింతలతో సందడి చేశారు. జోన్ డీన్ ప్రియా మనీష్, ప్రిన్సిపల్ బి.శశికళ తదితరులు పాల్గొన్నారు.

మురాద్‌నగర్ ఆర్‌బీఎస్‌లో..

మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలు ఉత్సాహంగా కేక్ కట్ చేసి ఉపాధ్యాయులతో పాటు స్నేహితులకు పంచారు. జోన్ డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపల్ రాజేశ్వరి, అకాడమిక్ ఇన్‌చార్జి నస్రీన్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బీఎస్ టోలిచౌకిలో..



ఆర్‌బీఎస్ మురాద్‌నగర్‌లో..

శుభాకాంక్షలు



నాంపల్లి: టీఎన్జీఓ డీఈఓ యూనిట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం హుస్సేన్‌ను గృహకల్ప భవన్ సముదాయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు విక్రమ్‌కుమార్, ఉమర్‌ఖాన్, కురాడి శ్రీనివాస్, ఖాలిద్,సదానంద్, ఉస్మాన్, శంకర్ తదితరులు ఉన్నారు.

పాతబస్తీలో సందడి

చార్మినార్: నూతన సంవత్సరానికి పాతబస్తీ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరంలో ఆదివారం చార్మినార్–మక్కా మసీదు వద్ద సందర్శకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు షాపింగ్ చేశారు. చార్మినార్ వద్ద సెల్ఫీలు తీసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. చార్మినార్‌తో పాటు వివిధ సందర్శనీయ స్థలాలను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు.



దివ్యాంగులకు అండగా వీరభద్ర చారిటబుల్ ట్రస్ట్



బాలుడికి వీల్ చైర్ అందజేస్తున్న కార్పొరేటర్ దేవర కరుణాకర్ తదితరులు

గోల్కొండ: దివ్యాంగులు, పేద విద్యార్థులకు వీరభద్ర స్వామి చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉండటం వారి సేవా గుణానికి చిహ్నమని గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ అన్నారు. గుడిమల్కాపూర్‌లోని వీరభద్ర స్వామి ఆలయం వద్ద వీరభద్ర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సేవా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ట్రస్ట్ సభ్యులతో కలిసి దివ్యాంగులకు వీల్‌చైర్లు, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, దుప్పట్లు, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్‌లోని ప్రతి సభ్యుడు సేవాతత్పరులని, కొంత కాలం నుంచి దివ్యాంగులకు వారి స్వస్థలాల నుంచి పిలిచి వీల్‌చైర్లు, ఇతర పరికరాలు అందించి మళ్లీ వారిని ఇళ్లకు క్షేమంగా పంపించడం గొప్ప విషయమని అన్నారు. మున్ముందు కూడా సేవా కార్యక్రమాలు కొనసాగుతుండాలని అన్నారు. బండ్లగూడ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి పి.అమర్ సింగ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉస్మాన్‌బిన్ హల్ హజ్రీ, బీజేపీ నాయకులు బోడి అశోక్ యాదవ్, కట్ల అశోక్, శ్రీధర్ సాగర్, వీరభద్ర స్వామి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అంబటి క్రాంతి సాగర్, ట్రస్ట్ ప్రతినిధులు అరవింద్ యాదవ్, పన్నాలాల్, మహేష్, శ్రీనివాస్, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో..

గౌలిపురా: భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టేషన్‌లో సీసీఎస్ ఏసీపీ శ్రీనివాస్‌రావు భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీతో కలిసి కేక్‌కట్ చేశారు. అడిషనల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి, ఎస్సై దామోదర్, సైదమ్మ పాల్గొన్నారు.



వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి

చార్మినార్: పాతబస్తీ సుల్తాన్‌షాహీలోని వాల్మీకుల మౌలిక సదుపాయాల కల్పనకు తాను కృషి చేస్తానని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోదీ అన్నారు. సుల్తాన్‌షాహీలోని కార్యాలయంలో బస్తీ నాయకులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. మహ్మద్ సలావుద్దీన్ లోదీ మాట్లాడుతూ.. రూ.10 లక్షలతో నీటి పైప్‌లైన్ వేయించేందుకు కృషి చేస్తానన్నారు. సోను, ధర్మేందర్, బి.దాస్, మహ్మద్ సర్ఫరాజ్ పాల్గొన్నారు.